# ఒరే

—కందాల శోభన

నెంబర్ 7047 హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్ళు గౌతమి ఎక్స్‌ప్రెస్ 3వ నెంబరు ప్లాట్‌ఫారమ్ నుంచి బయలుదేరుటకు సిద్ధముగా నున్నది...

నెంబర్ 7047 హైదరాబాద్ సె కాకినాడ జానేవాలి...

ఎనౌన్స్‌మెంట్ వస్తోంది. రైల్లో కూర్చున్న గోపాలరావుకి ఎక్సైట్‌మెంట్‌గా వుంది. త్వరగా వెళ్ళిపోవాలనే తపన. వెళ్ళి వాలిపోవాలనే అనిపిస్తోంది. అదీ ఉన్నపళంగా వెళ్ళిపోవాలి. ఒక గంటలో వెళ్ళిపోవాలి. కానీ కుదరదు. విమాన మార్గం లేనందుకు విసుక్కున్నాడు.

అసలు కార్లో బయల్దేరదామనుకున్నాడు. కానీ, ప్రయాణం కష్టం అవుతుందనిపించి రైల్లో బయల్దేరాడు. ఎనౌన్స్ చేసి అయిదు నిమిషాలైనా రైలు బయల్దేరనందుకు విసుక్కున్నాడు. కాసేపు ఇండియన్ రైల్వేస్ మొత్తాన్ని తిట్టుకున్నాడు. హాయిగా కార్లో వెళ్ళక ఈ రైలెక్కినందుకు. అంతలో రైలు బయల్దేరింది.

రైలు వేగంగా ముందుకు పోతోంది. గోపాల్రావ్ ఆలోచన్లు మాత్రం ఆ వేగంతో పోటీపడలేకపోతున్నాయ్. కొంచెం నెమ్మదిగానే వెనక్కి వెళ్ళాయి.

* * *

'ఒరే గోపీ!...'

'రారా బేగా వచ్చేయ్...'

'ఒరే... ఒరే... నేను... పరిగెత్తలేకపోతన్నా లా...'

'పరిగెత్తు... ఊ... ఇదుగో నా చెయ్యి ఉచ్చుకో...'

'అమ్మో...'

ఏడుపు లంకించుకున్నాడు చిన్నా. గోపి వాళ్ళ నాన్న వచ్చి వాళ్ళిద్దర్నీ ఎత్తుకుని ఆ వెంబడిస్తున్న కుక్కని అదిలించి ఇద్దర్నీ ఇంటికి తీస్కెళ్ళాడు. అదయినా గుడి దగ్గర కాబట్టి సరిపోయింది. గోపీ వాళ్ళ నాన్న అటువైపు నుంచే వస్తూంటాడు కాబట్టి చూసి రక్షించాడు.

అది చిలకంపాడు. ఆ ఊర్లోకి వెళ్ళాలంటే ఆ దారిగుండా వెళ్ళక తప్పదు. ఆ దారి అంటే మన గోపీ, చిన్నాలు కుక్క బారి నుంచి తప్పించుకున్న దారి. ఆ చోటు. ఈ సంఘటన గోపీ, చిన్నాల ఆరేళ్ళ వయస్సులో జరిగింది. ఇది జరిగిన తరువాత చిన్నాకి జ్వరం వచ్చింది. దడుచుకున్నాడు. నిజానికి గోపీకి కూడా భయం వేసింది. మర్చిపోయాడు. గోపీ, చిన్నా ఇంటికి ఆడుకోడానికి వెళ్ళాడు. చిన్నా పడుకుని వున్నాడు. వాళ్ళ నాన్న ఇంటికి పొమ్మని కసిరాడు. గోపీ చిన్న హృదయం చిన్నబోయింది. బెంగపెట్టుకుంది. బెంబేలెత్తిపోయింది. అలానే ఇంటికెళ్ళాడు. నిజం చెప్పాలంటే ఇంచుమించు ఎదురెదురే వీళ్ళ ఇళ్ళు.

చిన్నాకి జ్వరం వున్నంతకాలం గోపీ కూడా ఆడుకుంటే ఒట్టు. చిన్నా దగ్గరే కూర్చుని కబుర్లు చెప్పేవాడు. అలాంటి స్నేహం వాళ్ళిద్దరిదీ. కల్లాకపటం తెలీని స్వచ్ఛమైన స్నేహం. చిన్న వయస్సులో పెద్ద బంధం.

ఇద్దరూ బడికి కలిసే వెళ్ళే వాళ్ళు. ఒక్క బడికని ఏంటి? అన్నీ కలిసే. భోజనం, స్నానం, ఆటలు, చదువు అంతెందుకు ఒకే కంచం, ఒకే మంచం స్నేహం అంటే సరిపోదూ!

అప్పుడు వాళ్ళకి పదేళ్ళు. ఎవడో గోపీని, వాళ్ళ ఈడు వాడే, కొట్టాడు. గోపీ తిరిగి కొట్టేలోపే, చిన్నా వాడి మీద కలపడ్డాడు. వాడు ఏడ్చే వరకు వదిలిపెట్టలేదు. అసలు సహజంగా గోపీ కన్నా చిన్నా పిరికివాడు. కాని స్నేహితుడ్ని కొట్టగానే పౌరుషం వచ్చి కొట్టాడు. ఆటు తర్వాత భయం వేసింది చిన్నాకి. అంతా సద్దుమణిగింది. బాగానే వుంది. స్నేహితులిద్దరూ పెద్ద గొప్పగా భుజాలు తట్టుకుని ఎదుటి వాడ్ని ఎలా కొట్టారో కాసేపు వర్ణించుకున్నాక గానీ వాళ్ళ కోపం చల్లారలేదు. అప్పుడు శాంతించారు ఇద్దరూ.

అసలు వీళ్ళిద్దరూ బుర్రకథ చూడ్డానికొచ్చారు. కాదు వినడానికొచ్చారు. కాదు రెండిటికీ వచ్చారు. అక్కడ జరిగిన గొడవన్న మాట ఇది. అసలు ఎప్పుడూ ఆ ఊరి గుడి దగ్గర వుండేది ఈ బుర్రకథ. కానీ ఈసారి పెద్దరెడ్డిగారి ఎడ్లని, అసలు మొత్తం పాడిని అక్కడే పెట్టారు. అందుకని ఈసారికి ఈ బుర్రకథా కార్యక్రమం ఊరుకి కొంచెం దూరంగా వున్న పంట కాలవ దగ్గర పెట్టాల్సొచ్చింది. బుర్రకథంతా అయిపోయాక అందరూ వెళ్ళే తోపులాటలో ఇద్దరూ ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు నీళ్ళల్లో పడ్డారు. మరి ఒకరిని పట్టుకోబోయి ఒకళ్ళు పడ్డారో, లేక ఒకళ్ళ కోసం ఇంకోళ్ళు పడ్డారో, మొత్తానికి నీళ్ళల్లో పడ్డారు. తడిసారు. బయటకి వచ్చి అలానే ఇంటికి వెళ్ళారు. భయం, భయంగా వెళ్ళారు.

ఇంటికి వెళ్ళాక ఇద్దర్నీ, ఇద్దరి అమ్మా, నాన్నలు నిలబెట్టి అడిగారు. ఊరంతా వెతికాం ఎక్కడికెళ్ళారని. బుర్రకథ దగ్గరున్నాం అని వాళ్ళ సమాధానం.

అసలు వీళ్ళిద్దర్నీ కూర్చుని చదువుకోమంటే ఇద్దరూ మెల్లిగా వుడాయించారు. వాళ్ళింటో వుండుంటారని వీళ్ళు, వీళ్ళింటో వుండుంటారని వాళ్ళు అనుకోవడం, తర్వాత చూసుకోవడం, కనిపించకపోయేసరికి ఊరు అంతా వెతకడం జరిగింది. అయితే బుర్రకథ దగ్గర మాత్రం వీళ్ళిద్దరూ ముందు జాగ్రత్తగా దాక్కున్నారు.

ఆ విషయం అడుగుదామనుకున్నారు గానీ వాళ్ళ ఒంటిమీద గాయాలు, ఆ రక్తం చూసి, ముందు వాళ్ళేదో నిర్వాకం చేశారని, నిలదీస్తే మొత్తం చెప్పారు. కాసేపు వాళ్ళని తిట్టి, బట్టలు మార్పించి, ఆ గాయాలకి మందు రాసేటప్పటికి తలప్రాణం తోక్కొచ్చింది.

ఇలా వీళ్ళిద్దరూ కలిసి చేయని అల్లరి లేదు. చిన్నా, గోపీ కలిసున్నారంటే అక్కడేదో అయ్యింది అన్న మాటే. ఏదో అవ్వడం అంటే మామూలుగా



కాదు పెద్ద గందరగోళమే!

విధి ఎంత విచిత్రం. అందరికీ తెలుసు. అందరూ అంటారు. కానీ ఎవ్వరికీ అంతుపట్టదు. సరిగ్గా మన కథలో కూడా అలానే జరిగింది. కాలం ఎప్పుడూ ఒకేలా వుండదని మరోసారి నిరూపించింది.

గోపీ వాళ్ళు పట్టణం వెళ్ళిపోవాల్సొచ్చింది. అంటే గోపీ, అమ్మ, నాన్న మొత్తం కుటుంబం అన్నమాట. కారణాలేవంటే! అనేకానేక కారణాలు. అనుకోని అవాంతరాలు. ఏదైతేనేం స్నేహితులిద్దరూ విడిపోక తప్పింది కాదు.

వీళ్ళిద్దరూ ఆఖరుసారి కలుసుకుంది, మునసబుగారి అమ్మాయి పెళ్ళిలో. ఆయన ఊరందర్నీ పెళ్ళికి పిలిచారు. ఎప్పుడూ అల్లరి పిల్లలు అని పిలవబడే వీళ్ళని ఊర్లో అందరూ ఎంత మెచ్చుకున్నారో! పెళ్ళిలో చాలా సాయం చేశారు. చాలా అంటే ఉడత సాయం. వాళ్ళ తాహతుకు తగ్గ సాయం.

ఇలా ఈ పాత జ్ఞాపకాలన్నీ నెమరువేసుకుంటూ ఎప్పుడు నిద్రపోయాడో తనకే తెలీదు గోపాల్రావుకి.

* * *

“కౌసల్యా సుప్రజా రామా పూర్వా సంధ్యా ప్రవర్తతే...”

సుప్రభాతం వస్తోంది. గోపాల్రావు నిద్ర నుంచి లేచాడు. ఈరోజు అని కాదు. రోజూ సుప్రభాతంతో నిద్రలేవడం గోపాల్రావుకి అలవాటు. నిద్రలేవగానే, ఆసరికే పూజలు గావించి, మన రచయితలు, కవులు వర్ణించేట్టు పావలా కాసంత బొట్టుతో, చక్కని చీర కట్టుతో ఇంకా... ఎందుకులెండి తెలుగుతనం ఉట్టిపడుతూన్న శ్రీమతి దర్శనం చేసుకోవడం కూడా అలవాటే. మ్యా ఫ్యాషన్ ముసుగులో పాచి ముఖంతో 'బెడ్ కాఫీ' తాగడం అంటే గోపాల్రావుకి అసహ్యం.

లేవగానే కాలకృత్యాలు తీర్చుకుని, ఓ అరగంట దైవ సన్నిధిలో గడిపి, ఆ తర్వాతే కాఫీ. ఆ తర్వాత న్యూస్ పేపర్ మొత్తం చదివి, ఆఫీస్ రూమ్‌లోకి వెళ్తాడు. అప్పటికే చాలా మంది ఈయన కోసం నిరీక్షణ. 'ఎందుకూ?' అంటే రకరకాల పనులు మరి.

వాళ్ళందరితో మాట్లాడుతూ, ఫోన్స్ రిసీవ్ చేసుకుంటూ, ఆరోజు ప్రోగ్రామ్స్ పి.ఎ. ద్వారా విని అప్పుడు కదిలి టిఫిన్ చేస్తాడు. ఇదంతా అవ్వడం, ఉదయం తొమ్మిది గంటలు కొట్టడం ఒకేసారి జరుగుతాయి. తొమ్మిది గంటలు కొట్టుకోవడంలో తేడాలుంటాయేమోగాని, గోపాల్రావు పనుల్లో మాత్రం ఏ కొంచెం తేడా కూడా వుండదు.

అవుదు బయల్దేరి ఫ్యాక్టరీకి వెళ్తాడు. అక్కడ ఫైల్స్ చెకింగ్, కంపెనీ మొత్తం తిరిగి స్వయంగా కార్మికులని కలుసుకుని, వాళ్ళ గోడు వింటూ, వాళ్ళ సమస్యలకి పరిష్కారం చూపిస్తూ, వ్యవహారాలు సరిగ్గా నడుస్తున్నాయో లేదో చూసుకునేంతలో మధ్యాహ్నం ఒంటి గంట. ఆ సమయానికి ఇంటికి చేరుకుని లంచ్ తీసుకున్నాక, కొత్త ప్రోడక్ట్స్ గురించిన డిస్కషన్స్, దానికి సంబంధించిన ఇంజనీర్లతో సంప్రతింపులు, సాయంత్రం అయిదు గంటల వరకు జరుగుతాయి. అప్పుడు ఇంటికొచ్చి పళ్ళరసం తీసుకుని, తర్వాత మెడికల్ చెకప్. తనకెందుకు మెడికల్ చెకప్ అంటే భార్యా, పిల్లలు వింటేగా.

పిల్లలంటే గుర్తొచ్చింది. గోపాల్రావుకి ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల. అందరికీ పెళ్ళిళ్ళు అయిపోయాయి. తన కంపెనీ పనులే చూసుకుంటున్నారు. చేదోడు వాదోడుగా వుంటున్నారు.

మరి ఇద్దరు మగపిల్లలుండి ఈయనకెందుకు శ్రమ అంటే, అంతే! ఖాళీగా వుండలేనంటాడు ఈయన.

ఇంక సాయంత్రం పూర్తిగా కంపెనీ వ్యవహారాలు వదిలి, పురాణాలు చదవడం, మన కళలకు సంబంధించి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగితే, అక్కడికి వెళ్ళి ఆనందించడం. ఆ కళాకారులను ప్రోత్సహించడం, ఇవన్నీ అయ్యాక ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులు అందరితో కలిసి డిన్నర్ చేయడం, కాసేపు ఇంటికి సంబంధించిన విషయాలపై చర్చలు జరిగిన తర్వాత నిద్రకుపక్రమించడం, గోపాల్రావు దైనందిక కార్యక్రమాలు.

ఆరోజు, ఈరోజు అని కాకుండా, ప్రతీరోజూ క్రమం తప్పకుండా జరిగేవి, జరుగుతున్నవి. విశేషం ఏంటంటే అరవైయేళ్ళు మీదపడ్డా గోపాల్రావ్ పనుల్లో చురుగ్గా పాల్గొనడం.

ఆరోజు ప్రోగ్రామ్స్ లేక ఇంట్లో కూర్చున్నాడు, గోపాల్రావ్. అదే ఇంతవరకూ, అంటే ట్రైన్‌లో కాకినాడ బయల్దేరే వరకు దారితీసింది. ఖాళీగా కూర్చుని వుండగా ఆలోచన. ఆలోచన లోంచి పుట్టుకొచ్చిన అశాంతి. ఏవిటండీ! అన్నీ శుభ్రంగా వున్న గోపాల్రావ్‌కి అశాంతా! అంటారేమో! మరక్కడే వుంది మన కథంతా.

గోపాల్రావుకి అన్నీ సవ్యంగానే జరుగుతున్నాయి. బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్, మెడికల్ చెకప్, బిజినెస్ అఫైర్స్ అన్నీ వున్నాయి. కానీ ఏదో లోటు. ఏమిటన్నది అర్థం కావట్లేదు. ఏదో మదిని కెలుకుతోంది. నోట్లో ఆడుతోంది. మెదడుకి అందట్లేదు. మనిషిని నిలువెల్లా నిర్వీర్యుణ్ణి చేస్తోంది. జీవితంలో

ప్రతిరోజూ ఒకేలా జరుగుతోంది. మెకానికల్ లైఫ్. తను ఏదో కోల్పోతున్నాడు. అదే ఏంటి? మస్తిష్కంలో ఎంతో మేధస్సు కల గోపాల్రావుకి అదేంటో తెల్సుకోడానికి అట్టే సమయం పట్టలేదు.

అదో విచిత్రమైన లోటు. సామాన్యంగా ఆ వయస్సు వాళ్ళందర్నీ వచ్చే లోటు. ఇంతకీ ఏంటో తెల్సా? 'ఒరే' అని పిలిచేవారు లేని లోటు. అలా పిలిచే వాళ్ళు కావాలని, అలా పిలిపించుకోవాలని అతని పాట్లు.

చూసారా, 'ఒరే' అంటే గౌరవ భంగం అయ్యింది అనుకుంటే పప్పులో కాలేసినట్టే. దానిని చిన్న చూపుగా చూసే వాళ్ళపై వుపయోగించబడినా, ఇప్పుడొచ్చే సినిమాల్లో భ్రష్టు పట్టించినా, ఆ పిలువులో, ఆప్యాయత, స్నేహం, అనురాగం వున్నాయి. అలానే లాలిత్యం వుంది. ప్రేమ భావం వుంది. ఇలా ఇంకా చెప్పకుపోతే ఈ తరహా పదాలన్నీ వుపయోగించచ్చు. అంత అద్భుతమైంది 'ఒరే' అనే పిలువు.

తన కోరిక తనకే చిత్రం అనిపించింది గోపాల్రావుకి. తనేం కోరరానిది, కోరుకుదు పడనిది కోరలేదే! చాలా సామాన్యమైనదే, కానీ సున్నితమైనది. అసలెందుకీ తపన! అనురాగాన్ని కురిపించే భార్య, ఆప్యాయతలు వడ్డించే కొడుకులు, వినయ విధేయలతో మెలిగే సబార్డినేట్సో. వీరందరూ ఈయలేనిది. తన భావంలో భావంగా, ఆశయాలలో, ఆలోచనల్లో తోటి వాడిగా, కష్టసుఖాల్లో, ఆటపాటల్లో మనసున మనసై, స్వార్థం లేకుండా మంచి చెడులను తర్కించే ఓ స్నేహితుడి పిలువు.

'ఒరే గోపీ...' అన్న పిలుపు.

అలా తనని పిలిచే వాళ్ళెవరా అని వెతగ్గా, వెతగ్గా ఓ పురాతన స్నేహితుడు గుర్తొచ్చాడు. ఆ పల్లెటూరి స్నేహం గుర్తొచ్చింది. ఆ స్నేహితుడే చిన్నా అనబడే సదానందం. మన కథా నాయకుడు, అదే గోపాల్రావ్ అనబడే గోపీ ఇప్పుడు ఆ పల్లెటూరికే బయల్దేరాడు.

విజయవాడ వచ్చింది. తెల్లవారు జామునే లేచే అలవాటు. అందునా అలవాటు లేని ప్రయాణం. అసలన్నింటికన్నా విజయవాడలో రైలు ఎక్కువసేపు ఆగడం వలన ఆ సందడికి మెలకువ వచ్చింది. ఏదైతేనేం తర్వాత నిద్రపట్టలేదు. అది వయస్సు ప్రభావమో, ఊరు దగ్గరపడిందన్న ఉత్సాహమో!

గోపాల్రావ్ వాళ్ళ ఊర్నుండి వచ్చేసిన తరువాత ఆయన కుటుంబంలో చాలా మార్పులు జరిగాయి. అప్పుడు మధ్యతరగతి కుటుంబం. ఇప్పుడు తను కోటీశ్వరుడు. దానికి చాలా కష్టపడ్డాడు గోపాల్రావ్. అందుకే కష్టాన్ని నమ్ముతాడు. కష్టపడే వాళ్ళంటే ఇష్టపడతాడు. కష్టానికి అదృష్టం తోడవ్వడమనేది యాదృచ్ఛికం అని గోపాల్రావ్ నమ్మకం. తనకు కావల్సిన దాన్ని సఫలం చేస్కోవడాన్కి ఎంతైనా కష్టపడతాడు. అవిధంగా అన్నీ పొందాడు. కానీ 'ఒరే' అనే పిలువుకి నోచుకోలేకపోయాడు. ఇప్పుడు దానికోసమే ఇంతదూరం ఇంత కష్టపడి ప్రయాణం.

తాడేపల్లిగూడెం వచ్చింది. గోపాల్రావు ఆలోచన్ల నుంచి బయటపడి తొందరగా బండి దిగాడు.

ఇక ఇక్కడ్నుంచి చిలకంపాడుకి రైలుమార్గం లేదు. బస్సులో వెళ్ళాలి. ముందు టాక్సీలో వెళ్దామనుకున్నాడు. కానీ బస్సులో అయితే ఆ జనాన్ని, ఆ వాతావరణాన్ని చూసినట్టుంటుందని అలా బయల్దేరాడు. అది తాడేపల్లిగూడెం టు అత్తిలి బస్సు. జనం బాగానే వున్నారు.

బస్సు వెళ్తోంది. గోపాల్రావు భవనాల్ని, పొలాల్ని అన్నింటినీ పరిశీలిస్తున్నాడు. ఒకప్పుడు, అంటే వాళ్ళ చిన్నప్పుడు ఇదంతా వన్యప్రాంతం. తాడేపల్లిగూడెం కూడా అడవే. రైలుమార్గం బ్రిటీష్ దొరలు వేసింది.

మరిప్పుడో అది పట్టణం. అలాగే ఇప్పుడు, పంట పొలాలతో, కర్మాగారాలతో కళకళలాడేదంతా ఒకప్పుడు అడవులు.

బస్సులో టికెట్ తీస్కోడానికి, ఆలోచన్లకి అడ్డు వేయాల్సొచ్చింది. నాలుగు రూపాయలు టిక్కెట్టు. అదే మరి వాళ్ళ చిన్నప్పుడో! అప్పుడైతే అసలు సరైన మార్గం కూడా లేదు. ఎడ్లబండి మీద వెళ్ళాల్సి వచ్చేది. చిలకంపాడు వచ్చింది. బస్సు దిగి నడుస్తున్నాడు.

లాకుల మీద నుంచి ఊర్లోకి వెళ్తున్నాడు. వాళ్ళ చిన్నప్పుడు ఇవి వుండేవి కావు. కానీ ఇప్పుడు చిలకంపాడు లాకులంటే ఆ చుట్టుపక్కల ఊర్లల్లో తెలీని వాళ్ళుండరు. విజ్ఞానం వృద్ధిచెందింది. రైతుల ప్రయోజనార్థం లాకులు నిర్మించబడ్డాయి.

ఊర్లోకి వెళ్తున్నాడు. గోపాల్రావుకి ఓ వింత అనుభూతి. ఓ ఏభై ఏళ్ళ తర్వాత ఆ ఊరుని చూడ్డం. తన బాల్యం గడిచిన ఊరుని, తన రెండవ బాల్యంలో, అంటే వృద్ధాప్యంలో చూడ్డం మనసుని వులకరింపచేసే ఓ అనుభూతి. అది చాలా చిత్రమైన అనుభవం. అనేకానేక జ్ఞాపకాల మధ్య మనసు గింగిరాలు కొడుతోంది. ఉద్వేగం, ఉత్సాహం, ఉప్పెన, ఊరట అన్నీ కలుగుతాయి.

ఇళ్ళ మధ్యలో నడుస్తున్నాడు. ఇప్పుడు 'గుడి' ఊరి 'మధ్య'లో వుంది. వాళ్ళు ఆడుకున్న స్థలాలని పోల్చుకోవడం కష్టం అయ్యింది. అయినా తొందరగానే గుర్తుకు వస్తున్నాయి.

వైద్యశాల వుంది. ఊరు అభివృద్ధి అయ్యింది. ఒకసారి చిన్నాకి జ్వరం వస్తే తాడేపల్లి గూడెం రావాల్సి వచ్చింది.

'కానీ ఈ హాస్పిటల్ ప్లేస్‌లో ఏదో వుండాలే, ఏవిటబ్బా...!' అనుకుంటూ పక్కకి చూశాడు గోపాల్రావు. అక్కడ వున్నది కోమట్ల మేడ. అంటే ఆ గుర్తొచ్చింది. అక్కడ మర్రి చెట్టుండాలి, అదీ ఊడల మర్రి.

'ఇక్కడే ఉయ్యాలలూగేవాళ్ళం. మరి చెట్టేమయ్యింది? కోతికొమ్మచ్చి కూడా ఆడుకునే వాళ్ళం. కొట్టేసుంటారు...' స్వగతం అనుకున్నాడు.

తమ అవసరాలకో లేక ఊరి మధ్య ఊడల చెట్టు అడ్డనో కొట్టేసుంటారు. నవ్వొచ్చింది. విజ్ఞానంతో పాటు అజ్ఞానం కూడా పెరుగుతున్నందుకు. మనిషి వింత ప్రవర్తనకు.

హాస్పిటల్ నుంచి కుడివైపు తిరిగితే వాళ్ళ ఇల్లు కనబడుతుంది. కానీ ఏదీ! కనబడే! గోపాల్రావ్‌కి ఒక్క క్షణం నిస్పత్తువ. మళ్ళీ తేరుకుని, 'ఇప్పుడు చాలా ఇళ్ళు వచ్చాయన్న' విషయం గుర్తు తెచ్చుకుని, ఆ ఇళ్ళ మధ్యలోంచి ముందుకు కదిలాడు. అక్కడ కనబడుతోంది. అదే సదానందం ఇల్లు. అప్పుడెలాగుందో ఇప్పుడూ అలానే వుంది. కానీ కొంచెం శిథిలం అయ్యింది. గోపాల్రావు ఓసారి తను చిన్నప్పుడు పెరిగిన ఇంటివైపు చూస్కున్నాడు. ఇప్పుడక్కడ మేడ వుంది.

* * *

అక్కడ ఆ పెంకుటింటి అరుగుమీద చిరిగిపోయిన చొక్కా కుట్టుకుంటున్నాడు సదానందం. గోపాల్రావుకి తను ఇంతసేపూ డొంకల్లో బస్సులో వచ్చిన కష్టం, రాత్రి ప్రయాణ కష్టం అన్నీ మరిచిపోయే ఆనందం కలిగింది. తన లోటు తీరబోతోందనే ఆనందం. ఎప్పుడూ పనితో యాంత్రిక జీవితంలో వున్న తను ఎవరికోసం అయితే అవన్నీ వదిలి వచ్చాడో ఆ సదానందం.

మాట్లాడామంటే గొంతు పెగలటంలేదు. ఏదో ఆత్రం. ఎన్నెన్నో మాట్లాడేయాలనే తపన, ఆలసట అన్నీ గొంతుకి అడ్డుపడుతున్నాయి. చివరికి ఎలాగైతేనేం పలకరించాడు. ఒళ్ళంతా విద్యుత్‌శక్తి ప్రవహిస్తున్న అనుభూతి. అయితే అది కూడా ఎంతో సేపు లేదు. సదానందం గుర్తుపట్టలేదు.



పైగా,
'ఎవరండీ... మీరు...?'
'నేను... నేనురా... గోపాల్రావుని...'
'గోపాల్రావా! ఎవరు కావాలండీ మీకు...'
'సదానందం అంటే మీరేనా...'
'అవును...!'
'ఒరే చిన్నా! నేనురా గోపీని...'
'చిన్నా!... ఆ పేరెలా తెలుసు!... గోపీ అంటే...'
గోపాల్రావులో అసహనం. ఆలోచించి అక్కడ మేడని చూపించి, 'ఇక్కడ ఈ మేడ ఉండాల్సిన స్థలంలో ఇంతకు మునుపు ఏముండేది?
'పెంకుటిల్లు...!' సదానందం ఆశ్చర్యంతో కూడిన సమాధానం.
'ఆ... ఆ పెంకుటింట్లో ఎవరుండేవారు...?'
'రామయ్యగారనీ...'
'అహ... ఆ ఇల్లు అమ్మకముందు అసలు ఆ ఇంటి సొంతదారులు'
'సొంతదారులు అంటే... నా చిన్నప్పుడే వెళ్ళిపోయారు... వాళ్ళబ్బాయి గోపీ నా స్నేహితుడే... అంటే... గోపీ... మీరేనా గోపీ... గోపీ...'
'ఆ... నేనే ఆ గోపీని...'
కొలంబస్ కొత్త భూభాగాన్ని కనుగొన్నంత ఆనందం. కానీ కొంచెం నిరుత్సాహం. 'ఒరే గోపీ' అనకుండా 'మీరేనా గోపీ' అన్నందుకు.
తర్వాత అవీ, ఇవీ స్థితిగతులు మాట్లాడుకున్నారు. మాటల మధ్యలో ఎక్కడైనా 'ఒరే' అంటాడేమో అని చూశాడు గోపాల్రావు. అనలేదు సరికదా స్నానాదులన్నీ అయ్యాక ఓ అభ్యర్థన కూడా చేశాడు సదానందం ఉరఫ్ చిన్నా. అభ్యర్థన విని కోరిక తీరుస్తానన్నా స్నేహితుడిలా చూడకుండా, ఒక కోటీశ్వరుడిలా, 'లక్ష్మి' గడప తొక్కిందన్న పద్ధతిలో, ఓ పెద్దమనిషిలా చూస్తున్నాడు. లాభం లేదనుకుని ఊరు చూద్దాం పదమన్నా.
నడుస్తూ ఇద్దరూ హాస్పిటల్ దగ్గరకొచ్చాం. గోపాల్రావు కల్పించుకుని,
'ఒరే... చిన్నా...'
అనగానే పరధ్యానంలో వున్న సదానందం
'వస్తేనాండీ...'
'ఆ విన్నేరా...' అని, 'ఏంట్రా' అని చిన్నా అననందుకు మనసులో చిరాకుపడ్డాడు.
'చెప్పండి...' అడిగాడు సదానందం వినయంగా
గోపాల్రావులో ఒక్క క్షణం అసహనం.
'ఇక్కడ ఈ హాస్పిటల్ వుండేచోట ఓ మర్రిచెట్టు వుండేది గుర్తుందా...'
'ఆ వుండేదండి... దాన్ని నరికేసే కదండీ హాస్పిటల్ కట్టింది...'
'ఆ తెలుసులే...' విసుగు గోపాల్రావ్ కంఠంలో.
'ఇక్కడ మనం ఆడుకునే వాళ్ళం గుర్తుందా?... అదేరా ఉయ్యాల ఊగుతూ... గుర్తుందా...!'
'చిత్తం... పాత రోజులు...'
గోపాలరావుకి అసహనం పెరుగుతోంది. తనంత ఇదిగా అడుగుతుంటే వీడేంటిలా? అనుకున్నాడు. ఇద్దరూ పొలాల వైపు నడుస్తున్నారు.

సదానందం మళ్ళీ కొడుకు జాబ్ కోసం, గోపాల్రావుని అభ్యర్థించాడు. గోపాల్రావు 'సరే ఇప్పిస్తాను' అన్నాడు మళ్ళీ.
ఇంతలో కాలవ గట్టుకి వచ్చారు. గోపాల్రావు,

'ఒరే చిన్నా నీకు గుర్తుందా... బుర్రకథ చూడ్డానికొచ్చి ఇక్కడే నీళ్ళల్లో మనం పడిపోయాం...
'అవును సుమండీ మంచి జ్ఞాపకం... అందుకే ఇంత ఉన్నత స్థితిలో వున్నారు...' సదానందం ఆశ్చర్యం...
ఇలా ఒకచోట కాదు, ఒకలా కాదు. శతవిధాల ప్రయత్నించాడు సదానందం చేత 'ఒరే!!' అనిపించుకోవాలని. కానీ వినడే! చివరికి నాలుగు రోజులు వుందామని వచ్చినవాడు మర్నాడే ప్రయాణమయ్యాడు గోపాల్రావు.
చివరిసారిగా మళ్ళీ ప్రయత్నించాడు. అయినా లాభం లేకపోయింది. కొడుకు ఉద్యోగం విషయం తప్ప ఏం మాట్లాడలేదు సదానందం.
కొడుక్కి ఉద్యోగం ఇచ్చి, మంచి ఇల్లు, సదుపాయాలు, అన్నీ ఇస్తానన్నా సరే, సదానందం 'ఒరే' అనట్లేదు.
చివరిగా ఓ నిర్ణయానికొచ్చాడు గోపాల్రావు. కొడుక్కి ఉద్యోగం ఇప్పిస్తే, అప్పుడైనా పిలుస్తాడేమోనని... అయినా అప్పుడు మాత్రం పిలుస్తాడన్న ఆశలేదు గోపాల్రావుకి.
ఇలా రకరకాలుగా ఆలోచించి, తన కోరిక తీరనందుకు అసహనంగా ఇంటికి చేరాడు గోపాల్రావు.

* * *

అసలే కోరిక తీరలేదన్న చిరాకులో ఇంటికి వచ్చిన గోపాల్రావుకి, తెలిసిన మరో చిరాకు కలిగించే విషయం ఏంటంటే, కార్మికులు జీతాలు పెంచమని సమ్మె చేస్తున్నారు.
కార్మిక నాయకుడితో మాట్లాడడానికి రూమ్‌కి పిలిపించాడు గోపాల్రావు.
వాడు తాగేసి వచ్చాడు.
గోపాల్రావు అడుగుతున్నాడు.
'అసలు మీ కోరికలేంటి...?'
'జీతాలు పెంచాలి...' వాడి సమాధానం.
'ఎందుకు...?' గోపాల్రావ్ ప్రశ్న.
'ఎందుకంటావేంట్రా...' వాడి ఆవేశం...
అక్కడి స్టాఫ్ అందరూ వాడ్ని పట్టుకోబోయారు, కొట్టబోయారు. గోపాల్రావు ఆపి,
'ఏదీ మళ్ళీ అను...'
'ఏంటీ... రా... అనా... అంటాన్రా...' వాడు.
వాడ్నీసారి నిజంగా తన్నబోయారు.
గోపాల్రావు ఆపి వాడ్ని అమిత ఉద్వేగంతో, ఆనందంతో కౌగిలించుకున్నాడు.
అర్థం కాని కొడుకులు ఏమైందోనని ఆలోచిస్తున్నారు.
ఉద్యోగస్తులు పిచ్చి పట్టిందనుకున్నారు.
వాళ్ళందర్కీ ఏం తెలుసు? గోపాల్రావు తపన. నీకూ, నాకూ తప్ప.

■

## దర్శక శ్రీదేవి!



తన ముద్దుల పాపాయి జాన్వీ బోసి నవ్వులు, బుడిబుడి నడకలను చూస్తూ ఎంజాయ్ చేస్తున్న నిన్నటి ఆలిండియా నెంబర్ ఒన్ హీరోయిన్ శ్రీదేవి త్వరలో సొంత చిత్రానికి దర్శకత్వం వహించనున్నది. ఇప్పటి దాకా 'స్టార్ట్','యాక్షన్', 'కట్' చెప్పించుకుని దర్శకుని ఆజ్ఞలను అనుసరించిన శ్రీదేవి త్వరలో తానే యాక్షన్!, స్టార్ట్, కట్ అని నటీనటులని ఆదేశిస్తుందన్నమాట. ఈ సరికొత్త అవతారం ఆమెలో దాగిన కళాతృష్ణను తీర్చి కొత్త అనుభూతిని మిగల్చవచ్చు. తెలుగులో ఘనవిజయం సాధించిన 'పెళ్ళి' చిత్రాన్ని ఆమె భర్త బోనీకపూర్ హిందీలో రీమేక్ చేయనున్నారు.ఎప్పుడూ నెంబర్ ఒన్ అన్పించుకున్న శ్రీదేవి దర్శకురాలిగా కూడా నెంబర్ ఒన్ అన్పించుకోవాలని అసంఖ్యాకంగా వున్న ఆమె అభిమానులు ఆశించడంలో తప్పు లేదు కదా!